

సచ్చిదానంద సద్గురు

# సాయివాణి

ధార్మిక, సామాజిక మాస పత్రిక

(సాయి సేవాసమితి ప్రచురణ)


సంపుటి : 9    మార్చి, 2013    సంచిక : 10

(నందన నామ సం॥, ఫాల్గుణ మాసం)



**గౌరవ సంపాదకత్వం**

**శ్రీశ్రీశ్రీ స్వామీ సత్యపదానంద ప్రభుజీ**

**ప్రధాన సంపాదకత్వం**

**శ్రీ మాతా శుకవాణి**

భాషా ప్రవీణ, M.O.L.,M.A

**ప్రత్యేక సహకారం**

**శ్రీ వి.వి. కృష్ణారావుగారు (సాయిశ్రీ ప్రింటర్స్)**

**ప్రచార సారథ్యం**

**శ్రీ ఎం. సత్యనారాయణగారు** M.Tech


**సాయివాణి చందా వివరాలు**

| | | | |
|---|---|---|---|
| విడి ప్రతి | .......... | రూ॥ | 6/- |
| వార్షిక చందా | .......... | రూ॥ | 60/- |
| ఆజీవన సభ్యత్వం | .......... | రూ॥ | 600/- |


**చిరునామా :-**

**సాయివాణి**

C/o **శ్రీ సాయీ సేవా సమితి ట్రస్టు**

సాయిధామం, రామలింగంపల్లి(పోస్టు),

బొమ్మల రామవరం మండలం,

నల్గొండ జిల్లా - 508 126. ఆం.ప్ర.

**Ph : 9440413455, 9848133565**

Website : www.saidhamam.org

E-mail : saidhamam.seva@gmail.com, saidhamam.ram@gmail.com


**విషయసూచిక**    **పుట సంఖ్య**


మా వాణి ............ 2

రండి-రండి, ఇక్కడేదో ............ 6

స్వామీ వివేకానంద ............ 7

DECLARATION ............ 10

గోరక్షణ అంటే ............ 11

లేఖావాణి ............ 16

బాలవాణి ............ 17

శ్రీ సాయి సేవ ............ 21

షిరిడీ (కపర్దే) డైరీ ............ 23

మాతృసంస్థ కబుర్లు ............ 26








# మా వాణి





ప్రియ పాఠక లోకానికి,

మార్చి 10వ తేదీన రానున్న 'మహాశివరాత్రి' శుభాకాంక్షలు. మనం తెలుగువాళ్లం. త్రిలింగదేశస్థులం. దక్షారామం, కాళేశ్వరం, శ్రీశైలం అనే మూడు శివలింగాల మధ్య ఉన్న గడ్డ మనది. తెలుగువారు ప్రాథమికంగా శైవులు-శివారాధకులు. పరమశివుడు నిరాడంబరుడు. నిరంతరం తపస్సమాధిలో ఉంటాడు. స్మశానమే ఆయన నివాసస్థలం. శివుని చేతిలో ఉండేది పునుక-అంటే కపాలం(పుఱ్ఱె). అదే ఆయన భిక్షాపాత్ర. భిక్షాటనంతో జీవించటం శివునికి దైనందిన జీవిక. శ్రీ మహావిష్ణువు అలంకారప్రియుడు. కానీ ఈశ్వరుడు తనువున పులుముకొనేది బూడిద-అదీ వల్లకాటిలోనిది. శ్రీహరి కౌస్తుభమణిని ధరిస్తే యీయనగారు మెడలో పాములు ధరిస్తాడు. ఆయన పట్టుపీతాంబరాలు ధరిస్తే శివుడు తోలు చుట్టుకుంటాడు. శివునికి వాహనం నిరంతరం కృషి చేసే ఎద్దు. చేతిలోని ఆయుధం త్రిశూలం. శ్రీహరి కంఠాన వనమాల ఉంటే యీయనగారి కంఠానికి ఆభరణం నల్లమచ్చ. భోళాశంకరుడు, ఉబ్బు శంకరుడు అని పేరొందినవాడు శివుడు. శివతత్త్వం చాలా చిత్రమైనది. శం-శుభాన్ని, కరుడు-చేసేవాడూ ఆయనే, రుద్రుడూ, లయకారుడూ ఆయనే.

పరమేశ్వర తత్త్వం, రూపం కూడా యీ సృష్టి యొక్క అస్థిరత్వాన్నీ అనిత్యత్వాన్నీ సూచిస్తూనే ఉంటాయి. మనిషిని భవసాగరంలో మునిగి పోయేలా చేసే కామాన్ని, క్రోధాన్ని, అహాన్ని ఎలా లొంగదీసుకోవాలో ఆయన రూపం చెప్తుంది. మనిషి ఎంతటి సుందరుడైనా, సుశీలుడైనా, కులీను డైనా, పండితుడైనా సరే-ఏదో ఒకనాటికి చేరక తప్పనిచోటు వల్లకాడే.

మనిషి తానెంతటి ఐశ్వర్యంలో ఆనందంలో జీవిస్తున్నా వీటన్నిటినీ వదిలిపెట్టి పోవలసిందే. అక్కడ నిరుపేదతో, దుఃఖితుడితో సమంగా పవళించవలసిందే. అందుకే 'సమభూమి' అన్నారు స్మశానాన్ని. శివుడు ఆ సమభూమినే నివాసంగా చేసుకున్నాడు. మానవుడు పులుముకున్న అంగరాగాలన్నీ అశాశ్వతాలే. చివరికి తోడుగా నిలిచేది బూడిదొక్కటే. శివుడు అదే రాసుకుంటాడు. ఆయన చేతిలోని త్రిశూలం మూడు మొనలతో ఉంటుంది. సత్త్వ రజ స్తమో గుణాలే ఆ ముమ్మొనలు. వాటిని తన చేతిలో ఉంచుకొని అవసరమైనపుడు ఆయా గుణాలను ఉపయోగిస్తాడేగానీ, తాను లొంగడు. ఆ విధంగా మనం ఎలా ఉండాలో శివుడు మనకు సూచిస్తాడు.

శివుడు నాగాభరణుడు. పాము క్రౌర్యానికీ, గుప్తమై బుసలుకొట్టే కోరికలకూ చిహ్నాలు. వాటిని తన మెడలో వేసుకొన్నాడంటే అర్థం వాటికి అతీతంగా వాటిని లొంగదీసుకొని ఉన్నాడని. అవి యీాయనకు ఆభరణాలుగా (అంటే లోకక్షేమార్థం - తారకాసుర సంహారానికై పార్వతిని పరిణయమాడి కుమార సంభవానికి కారకుడైనట్లు) ఉండవలసిందే తప్ప-వాటికాయన లొంగడు, వంగడు. శివవాహనం వృషభం. ఇది అహంకారానికి ప్రతీక. సాధారణంగా మనిషి నెత్తికెక్కి స్వారి చేసేది అహంకారమే. అందుకే కామ, క్రోధాది అరిషడ్వర్గానికి అహంకారమే నాయకుడనీ, అహంకార జన్యమైన మమకారమే ఉపనాయకుడనీ అంటారు విజ్ఞులు. శివుడు నిరంతర తపస్సంపన్నుడు. అందుచేత ఆయన తనువు వేడెక్కుతూ ఉంటుంది. ఆయన తీవ్రతపనను తగ్గించేందుకే తలపై నెలవంక, గంగమ్మలను ధరించాడేమో! భగవానుడు తాను చేయదలచుకొన్నదానికి ఏదో ఒక వంక పెట్టుకొంటాడు గదా!

శివుడు కాముని జయించిన గాథ ఒక చిత్రహేలగా సాగుతుంది. ఎంతటివాడినైనా లొంగదీయగలనన్న అహంభావి మన్మథుడు. "అండగా,





మదనుడుండగా నీవంటి తరుణి వరువెదుకగ పోవలెనా?" అని పార్వతి దగ్గర బీరాలు పలికాడు. ఎంతటివాడినైనా సరే "కోలనేయనా? సరసన కూలనేయనా?" అని విర్రవీగాడు. శరములకు లొంగే అలసుడు కాడతడు-భక్తికేగాని లొంగడని పార్వతి చెప్పినా వినకుండా రుద్రుని మీదనే శరసంధానం చేసాడు. "ఎన్నడూ చలించని తన మనసులో ఏదో వికారం కలుగుతున్నదేమిటి!" పరమశివుడు ఒక్క క్షణంలో తన్ను తాను సంబాళించుకొని చుట్టూ చూచాడు. మదనుని పొలకువ గ్రహణకు వచ్చింది. మరుక్షణంలో ముక్కంటి కంటి మంటలకు ఎరయై మన్మథుడు బూడిద రాశిగా మిగిలాడు. అటుపైన దేవతల విన్నపాన శివుడు పార్వతీ పతి అయినాడు. ఇదో గొప్ప మార్మికగాథ. మనిషి ఆంతర్యం నిరంతర బ్రహ్మచర్యంలో ఉండాలి. ఒకవేళ మనసు చెదిరినా నిగ్రహించుకోగల శక్తి ఉండాలి. దాంపత్యం సంతానం కోసమేగానీ సరసాలలో మునిగి పతనం కావటానికి కాదన్న విషయం స్ఫురణలో ఉంచుకోవాలి. (ఇదుగో- యీా విషయం పరోక్షంగా చెప్పడానికే మన పూర్వులు సంగమవేళలు, తిథులు, పద్ధతులు, విధి నిషేధాలు-వివరంగా చెప్పారు. వాటిని అతిక్రమించిన దితి సంతానం దైత్యులు-అంటే రాక్షసులయ్యారు. ఇప్పటి మన నరరూప రాక్షస సంతతికి కారణం యీా సమయాసమయాలను పాటించక పోవటం కూడా కావచ్చునేమో! మనం స్త్రీని దోషదృష్టితో చూడటాన్ని పశుకామం అంటాంగానీ - అసలు పశువులు సంతతి కోసమే నియమిత ఋతువుల లోనే ఆ గొడవలో పడతాయి గానీ విశృంఖలంగా, అతివేలంగా సంచరించవు. వావివరుసలన్నవి వాటికి సహజంగానే లేవు. వాటిని నియమించుకొన్న మనిషే అవి తప్పి ప్రవర్తిస్తున్నపుడు వీడిని పశువులతో పోల్చటం, పాపం! వాటిని అవమానించటం కాదూ!)

పరమశివుని కథలో హాలాహలభక్షణ లోకోత్తరమైన గాధ! సురాసురులు క్షీరసాగర మథనం సాగించినపుడు రత్నాలూ, అప్సరసలు,

కౌస్తుభం, అమృతం, ఉచ్ఛైశ్రవం, ఐరావతం వగైరా వగైరాలన్నీ ఉద్భవించాయి. వాటిని ఎవరెవరో పంచేసుకున్నారు. హాలాహలం భక్షించడానికి మాత్రం శివుని శరణువేడారందరూ. "ప్రభువైన వాడి కర్తవ్యం ప్రజల కష్టాలు తీర్చడమే. పరహితం చేసేవాడు పరమాత్మునికి చేరువవుతాడు. పరహితునకు నెదురులేదు పర్వేందుముఖీ!" అని పార్వతికి చెప్పి, ఆ పరమ భీకరమైన విషాన్ని జాంబూఫలం (నేరేడుపండు)లాగా అరిచేతిలోకి ఆహ్వానించి 'హేలాగతిన్' మ్రింగేసాడు శివుడు. మళ్లీ అది కడుపులోకి వెడితే అక్కడి భువన భాండారాలకు ఏమి కీడు వాటిల్లుతుందోనని కంఠంలోనే నిలిపివేసాడు. అది కాల్చిన అంతలెక్కా నల్లగా మచ్చ పడిపోయింది గొంతు మీద. అది కూడా ఒక ఆభరణమే అయింది ఆ స్వామికి. ఇదంతా జరుగు తోంటే నిర్భయంగా నిబ్బరంగా చూస్తూ నిలుచున్నది అమ్మవారు.(ఆ సర్వ మంగళ తన మాంగళ్యంబునెంతగా మదినమ్మినదో! - అన్నారు పోతన్న.)

దేశపరిపాలకులైన వారందరికీ యీ కథను పారాయణగాధగా పెట్టి కంఠస్థం చేయించాలి. భూమికి బాధ కలుగుతోంది మందరం వలన- శ్రీహరి పరుగునవెళ్లి ఆదికూర్మమై ఆ తాకిడి బాధ తాను తీసుకున్నాడు. అందరూ అన్నీ పంచుకొన్నాగానీ శివుడు ఏమీ తీసుకోలేదు. దేవతలంతా ఒకరిపై ఒకరు అసూయ చెందలేదు. మన రాజకీయ నాయకమ్మన్యులందరూ యీ విషయాలు గమనించగలిగితే దేశం ధన్యమవుతుంది.

అయ్యా, మనం తైలింగులం-తెలుంగులం-తెలుగువాళ్లం. అందుచేత శివుని నిరాండబరత్వాన్నీ, నిర్మోహత్వాన్నీ, కామాన్ని స్వాధీనంలో ఉంచుకోగల సంయమనాన్నీ, పరహితం కోసమై ప్రాణాలర్పించడానికైనా సిద్ధం కాగల త్యాగశీలాన్నీ అలవరచుకొని తీరాలి. అప్పడే మనకు శివరాత్రి జరుపుకొనే అర్హత లభించేది. "నీ దేవుడెక్కడున్నాడురా?" అని అడిగిన తండ్రితో ప్రహ్లాదుడు చెప్పిన "కలడు త్రిలింగదేశ వ్యక్తులందంతటన్" అన్న మాటకు దీటుగా నిలవగలిగేది. లేదా మన ఖర్మ యింతే.



# రండి-రండి!

## ఇక్కడేదో పండగంట!

ప్రియ మిత్రులారా, సాయి భక్తులారా!

మన ప్రియతమ సాయిధామంలో మార్చి 29వ తేదీన ఒక మహోత్సవం జరగనున్నది. సాయినాథుల వారు మనపై కరుణ చిలికించి మనకై పంపిన మన సద్గురువు **శ్రీశ్రీశ్రీ స్వామీ సత్యపదానంద ప్రభుజీవారు** యీ తనువుతో అవతరించిన ఫాల్గుణ బహుళ విదియ ఆనాడే. స్వామి వారికి 74 వసంతాలు నిండుతున్న ఆ శుభదినాన మనమందరం కలిసి శ్రీ సాయిదేవులను పూజించుకొని, గురుదేవులను అర్చించుకొని వారి ఆశీస్సులు పొంది ధన్యులమవుదాం. ఆ ఉత్సవానికి మీరంతా తరలి రండి. తరించండి.

**28-03-2013 - గురువారం**

| | | |
|---|---|---|
| ఉదయం | 8.00 | సాయిచాలీసా (74 ఆవర్తాలు) |
| | | విష్ణుసహస్ర నామ పారాయణ (74 ఆవర్తాలు) |
| | 10.00-1200 | సామూహిక సాయి వ్రతాలు, హారతి, ప్రసాద వినిమయం |
| ఉదయం | 6.30 | క్షీరాభిషేకం - విష్ణుసహస్ర నామంతో |
| | 8.30 | భగవద్గీత భక్తి, కర్మయోగ పారాయణ |

**29-03-2013 ఫాల్గుణ బహుళ విదియ - శుక్రవారం**

| | | |
|---|---|---|
| ఉదయం | 6.30 | క్షీరాభిషేకం - విష్ణుసహస్ర నామంతో |
| | 8.30 | భగవద్గీత భక్తి, కర్మయోగ పారాయణ |
| | 9.30 | శ్రీ సాయిపూజ, దీపోత్సవం (74 దీపాలతో, పుష్పాలతో) |
| | | గురుపూజ, గురుస్తుతి, చిన్న సాంస్కృతిక ప్రదర్శన |
| | | గురుదేవుల ఆశీస్సులు |
| | 12.00 | మహాహారతి |
| | 12.30 | వస్త్రదానం, వస్తుదానం |
| | 1.00 | అన్నప్రసాద వితరణ |

వ్రతాలలో స్వయంగా పాల్గొనలేనివారు తమ గోత్రనామాలు (రూ.116 దక్షిణతో) ఫోన్ ద్వారాగానీ, ఉత్తరాల ద్వారాగానీ తెలియజేస్తే వారి పేరిట పూజ చేయబడుతుంది. ప్రసాదం పంపబడుతుంది. భక్తులందరికీ ఆహ్వానంతో,

**- మీ ధర్మాధికారి, సాయిధామం**

**ఫోన్ : 9440413455**
**9848133565**

# స్వామీ వివేకానందను గూర్చి

- డేవిడ్ ఫ్రాలే

హిందువుల దృష్టిలో వివేకానందుడు గొప్ప దేశభక్తుడు, బహుశా ఆధునిక హైందవ పునరుజ్జీవనానికి కేంద్రబిందువు ఆయన. ఒక హిందువుగా ఆయన తన ధర్మాన్ని సగర్వంగా గొంతెత్తి ప్రకటించాడు. తమ దేశపు సాంప్రదాయిక, ఆధ్యాత్మిక సంస్కృతిని గౌరవించి, దానిని వికసింపజేయ వలసిందిగా ప్రోత్సహించాడు. వేదాలు, పురాణాలు, తంత్రాలు, ఆధునిక బోధకుల సందేశాలు - యివన్నీ ఆత్మ సాక్షాత్కారపు ఒకే ఉద్యమానికి చెందినవంటూ వీటిద్వారా ఏర్పడిన సంప్రదాయ సర్వస్వంలో ఏకత్వం వున్నదని ఉద్ఘాటించాడు. చాలామంది ఆధునిక హిందువులవలె కాకుండా ఆయన తన హిందుత్వాన్ని దాచుకోలేదు. హిందువైనందుకు చింతిస్తున్నా ననలేదు. అందుకు క్షమాపణ కోరలేదు. విశేషించి భారతదేశ సంస్కృతి సమున్నతమైనదని ఆయన అభిప్రాయ పడ్డాడు. ఆధునిక భారత దేశపు సమస్యలను గుర్తిస్తూ పాశ్చాత్యుల నుంచి భౌతికమైన సహాయాన్ని ఆశించాడేగాని ఆధ్యాత్మిక లేక ధార్మికమార్గ దర్శకత్వాన్ని కోరలేదు. హైందవ సంస్కృతిని, మూల్యాలను ప్రచారం చేస్తూ హిందూత్వానికి ఒక విధమైన మిషనరీగా ఆయన ప్రపంచమంతటా పర్యటించాడు. హైందవ, ఆధ్యాత్మిక బోధనలు సమస్త మానవజాతికి వర్తిస్తాయని భావించాడు. ఆధునిక హిందూత్వానికి అత్యంత ప్రతిభాన్వితుడైన ప్రచారకుడు ఆయన. హిందూత్వ బోధకులు ప్రపంచమంతటా పర్యటించి వివిధ ఆధ్యాత్మిక కేంద్రాలు నెలకొల్పటానికి నాందీ ప్రస్తావన చేశాడు. ఆ అడుగుజాడలోనే పలువురు నడిచారు.

అయినప్పటికీ వివేకానందుని దృష్టిలో హిందూత్వపు సారం వేదాంతమే, ఆత్మసాక్షాత్కార విధానమే. కాని మధ్యయుగాల నుండి వస్తున్న హిందూ సామాజిక నిర్మాణం కాదు. హిందూత్వం యొక్క యథార్థ





భావనకు ఏమాత్రం ప్రాతినిధ్యం వహించక, కేవలం ప్రాచీనకాలం నుంచి ఆచారంగా వస్తున్న కారణంగా హిందూత్వంలో భాగంగా పరిణమించిన కఠినమైన కులనిబంధనలు, స్త్రీల పట్ల అగౌరవర్తనము, తదితర సాంఘిక దురాచారాలను వ్యతిరేకించిన గొప్ప సంస్కర్త వివేకానందుడు. భారతదేశపు దోషాలకు కారణం దాని ఆధ్యాత్మిక, ధార్మిక సంప్రదాయం కాదని, ఆ సంప్రదాయాన్ని అపార్థం చేసుకొని దుర్వినియోగం చేయటమే నని వివేకానందుడు హిందువులకు నిరూపించి చూపాడు. అయితే హిందూ సంస్కృతిని, చరిత్రను తిరస్కరించే కేవల హిందూ తత్వవేత్త కాడు వివేకానందుడు. సంస్కృత భాషను, వేదాలను, హిందూ సంగీతాన్ని హిందూ సంస్కృతికి చెందిన సర్వాన్ని ఆయన ఎంతగానో ప్రేమించిన వాడు కూడాను. ఈ సంస్కృతిని యితరుల మీద రుద్దాలని ఆయన యత్నించలేదు. కాని దీనిని అందరితో పంచుకోవాలని ముచ్చటపడ్డాడు.

ప్రపంచంలోని అన్ని మతాలు, తత్వశాస్త్రాలు, విజ్ఞానశాస్త్రాల వెనుక ఒకే ఒక సత్యం వున్నదని బోధించిన విశ్వజనీన వ్యక్తి వివేకానందుడు. మంచి లేదా యథార్థమనేది ఎక్కడ కనిపించినా, ఏ మతంలో సంస్కృతిలో ఉన్నా, నేపథ్యంతో నిమిత్తం లేకుండా ఏ వ్యక్తి నుంచైనా సరే ఆయన స్వీకరించేవాడు. బౌద్ధం, క్రైస్తవం, ఇస్లాంతోసహా అనేక విభిన్న మతాలలోని మంచి విషయాల గురించి ఆయన ప్రసంగించాడు. పాశ్చాత్యుల విజ్ఞానశాస్త్రంలోను, తత్వశాస్త్రంలోను ఉన్న విలువైన అంశాలను అభినందించాడు. మేధోపరంగా నాస్తికులు చేసిన సేవలు, వారి మానవతావాదం వారి స్వతంత్రమైన ఆలోచనావిధానానికిగాను వారిని కూడా కీర్తించాడు.

వివేకానందుని దృష్టిలో వేదాంతం అనేది ఊరికే ఆలోచించవలసిన లేదా మేధోపరంగా చర్చించవలసిన తత్వసిద్ధాంతం కాదు. ప్రపంచానికి దూరంగా నివసించే ఎవరో కొద్దిమంది సాధువుల బృందానికి మాత్రమే బోధించవలసినది కాదు. ఆయన బోధించినది "అనుష్ఠాన వేదాంతం"- నిత్య జీవితంలో ఆత్మజ్ఞానాన్ని వ్యక్తీకరించే మార్గం. సర్వసాధారణమైన

మానవ వ్యవహారాలన్నింటిలోను, సమాజమంతటిలోను ఆత్మసాక్షాత్కారపు చైతన్యాన్ని తీసుకురావటమే ఆయన దృష్టిలో "అనుష్ఠాన వేదాంతం". అనుష్ఠాన వేదాంతమంటే స్వేచ్ఛ. స్వతంత్రమైన ఆలోచన, ఉదాత్తమైన సౌశీల్యం, ప్రతివ్యక్తిలోను ఉన్న దివ్యత్వాన్ని గౌరవించటం. అనుష్ఠాన వేదాంతమంటే సత్య సంధత, కారుణ్యం, విశుద్ధ వ్యక్తిత్వం, అజ్ఞాన, అధార్మిక శక్తులతో రాజీ లేకుండా నిలవటం.

అనుష్ఠాన వేదాంతం ప్రకారం మనలో ఏ ఒక్కరూ పరిమితులు కారు, బలహీనులు కారు. మనలో ఏ ఒక్కరూ పతితులు కారు. ఉద్ధరించబడవలసిన వారు కాదు. మనం రోగగ్రస్తులం కాదు. ఓదార్చబడవలసిన వాళ్లం కాదు. రోగం కుదర్చబడవలసిన వాళ్లం కాదు. ఈ చిన్న శరీరమూ, ఈ పరిమితమైన మనస్సు కాదు మనం. ఆఖరుకు ఆత్మలమో, దేవుని బిడ్డలమో కూడా కాదు. మనమే దేవుడు. కాదు, దేవుడికంటే కూడా గొప్పవాళ్లం. సర్వజీవులలోని ఆత్మయే మనం మనలో ప్రతి ఒక్కరూను. పదార్థము, మనస్సుతో కూడిన ఈ సమస్త విశ్వం మన నీడయే తప్ప అంతకు మించినది కాదు. ఈ విశ్వానికి అధిపతులమైన మనం కోపానికి, భయానికి లేదా కోరికకు లొంగిపోవటం, ఏదో కావాలని కోరుకొనటం, ఎవరి అభిప్రాయానికో బానిసలుగా వ్యవహరించటం అనేది మన హోదాకు, హుందాతనానికి భంగకరమైనది. జీవితంలో మన యథార్థ స్థానం ఈ ఆత్మ వైభవాన్ని వ్యక్తీకరించటమే తప్ప తుచ్ఛమైన భోగలాలసత్వంలో మునిగితేలటం, ఆస్తులు కూడబెట్టుకొనటం, పాపానికి ఆలవాలమైన యితర అధమతర జీవనలక్ష్యాలను ఆశ్రయించటం కానేకాదు. స్వామీ వివేకానందను "వేదాంతకేసరి" అన్నారు యీ బోధలకే.

ప్రాచీన మహర్షుల విజ్ఞానాన్ని ఆయన స్వీకరించి, రానున్న కాలంలో మానవాళి అనుసరించదగిన మార్గాన్ని నిర్దేశించే విధంగా నవీనమైన భాషలో సమర్పించాడు ఆయన. కనుకనే వివేకానందుణ్ణి గౌరవించటమంటే ఆయనను ప్రసాదించిన మహత్తర సంప్రదాయాన్ని గురించి గౌరవించటం, దాని సంపదను ఎల్లరితో పంచుకొనటం అని కూడా అర్థం.





# DECLARATION

Statement about ownership and other particulars about **"Sachidananda Sadguru Sai Vani".**

| | | | |
|---|---|---|---|
| 1. | Place of publication | : | Hyderabad |
| 2. | Periodicity of publication | : | Monthly |
| 3. | Printer's Name | : | V.V. Krishna Rao |
| | Nationality | : | Indian |
| | Address | : | Sai Sri Printers, 8-3-945, Shop No. 21, Pancom Business Centre, Ameerpet, Hyderabad - 500 016 (A.P.) |
| 4. | Publisher's Name | : | Mata Sukavani |
| | Nationality | : | Indian |
| | Address | : | Saidhamam, Nalgonda Dist, Pin - 508 126 |
| 5. | Editor's Name | : | Mata Sukavani |
| | Nationality | : | Indian |
| | Address | : | Saidhamam, Nalgonda Dt, Pin- 508 126 |
| 6. | Owner's Name | : | Sai Vani Publications, Saidhamam, Nalgonda Dist - 508 126 |

I, Mata Sukavani declare that the particulars given above are true to the best of my knowledge and belief.

Date : 01-03-2013

Sd/-

Mata Sukavani

# గోరక్షణ అంటే ...

ఆ మధ్య గోరక్షకులమని కొందరు మిత్రులు సాయిధామానికి వచ్చారు. గోమాత విశిష్టతను గురించీ, పంచగవ్యాల విలువలను గురించీ, అనాదిగా గోవులో సర్వదేవతలూ కొలువై ఉన్నారన్న విశ్వాసం గురించీ, యింకా దేశవాళీ ఆవులే పవిత్రమైనవన్న భావన గురించీ యిలా ఎన్నెన్నో విషయాల మీద చర్చలు, వివరణలు సాగాయి. గోహత్య ధ్యేయంగా వెలసిన అల్‌కబీర్ల గురించీ, పనిగట్టుకొని ఆవులను కోసుకు తినే విధర్మీయులను గురించీ, అలా అలా వెళ్లి పెద్దకూర పండుగ అనే వికారోద్యమం దాకా సంభాషణ సాగింది. ఆ తరువాత ఎన్నెన్నో సందేహాలు తేనె తుట్టెల్లాగా లేచాయి బుర్రలో. నాకు గోవులంటే గౌరవం, ప్రేమ అన్నీ ఉన్నాయి. మా చిన్నప్పడు గోవులో దేవీ దేవతలందరూ నిండి ఉన్న కేలెండరు ప్రతి సంవత్సరం తెచ్చి యింట్లో తగిలించేవారు. పంచామృతంలో కలిపే మూడు అమృతాలూ గోభిక్షేనని నాకు తెలుసు. కూర కలుపుకొని నెయ్యి వేసుకొంటూ "అరవై రుచులూ ఆవు చన్నులోవే" అనేది మా అమ్మ. అయితే నాకు ఆవు మీద ఉండే ప్రేమ వల్లనే యీ సందేహాలన్నీ పుట్టాయన్నది నా ఖచ్చితమైన విశ్వాసం.

పూర్వం ప్రతి గ్రామానికీ కొంత "పచ్చిక బయలు' (ఇది ప్రభుత్వం వారిదైనా కావచ్చు, గ్రామవాసులందరూ కలిసి ఏర్పరచుకొన్నదైనా కావచ్చు) ఉండేది. దీన్ని కొన్నిచోట్ల 'బీడు' అనేవారు. ఇది ఊరుమ్మడి సొత్తు. ముసలిఆవులు, ఎడ్లు, గేదెలు, ఆంబోతులు-ఏవైనా సరే యథేచ్ఛగా మేయవచ్చు. ఆ రోజులలో వట్టిబోయిన గొడ్లను కబేళాలకు తోలడం అన్న మాతృద్రోహచర్య లేనేలేదు. ఆ బీళ్లలో తిరిగి మేసేవి. ఇంటికి వచ్చి కొట్టంలో ఓ ప్రక్కన పడుకొనేవి. వాగులకు, కాలవలకు, చెరువులకు కరువు లేని రోజులు గనుక నీళ్లకు, పరిశుభ్రతకు దిగుల్లేదు. ముసలి ఎడ్లు కూడా





నందీశ్వరుల్లా కనపడేవి. మరి-ఇప్పడు ఊళ్లో దోసిలంత నేలైనా ఊరికే వదుల్తున్నామా? కూరపాదులు పెంచుకోను కూడా చోటు వదలకుండా ఇళ్లు కట్టేసుకొంటున్నాం. పల్లెటూళ్లలో కూడా ఇంటి చుట్టూ రాయి పరిపించేసుకొనే సంస్కృతి పెంచేసుకొంటున్నాం. ఇలాంటి వాతావరణంలో వట్టిబోయిన ఆవుల గతేమిటి? గోశాలలు పెడుతున్నాం. ఎన్ని? అవి నడవడానికైనా గడ్డి, వనరులు కావాలి గదా! - ఉన్నాయా? ఎంత శాతం? గ్రామగ్రామాన ఖచ్చితంగా పచ్చిక బయళ్లుంచితే యీ ఖర్మ వచ్చేది కాదు. మన ప్రభువులు మెయ్యగా మిగిలిన భూములు ఎక్కడైనా ఉంటే గదా బీళ్లు పెంచడానికి?

ఆవులను పెంచే వాళ్లంతా గౌరవంతో, ప్రేమతో పెంచుతున్నారా? దూడలను చంపి, చేట పెయ్యలను పెట్టి పాలు పిండుకుంటున్నవారి మాటేమిటి? మనది వ్యవసాయ ప్రధానమైన దేశం. మన వ్యవసాయానికి ఎడ్లు మూలాధారం. అందుకే భారతీయ రైతు కోడెదూడలను తన బిడ్డల కన్నా శ్రద్ధగా సాకుతాడు. గోవును నిర్లక్ష్యం చేస్తే ఆ సంతతే నశించిపోతుంది గనుక గోవుకు విశేషమైన గౌరవం లభించింది. కనీసం ఊరికి ఒక్కరిద్దరైనా పశువైద్యం తెలిసిన పెద్దలుండేవారు. వారు ఆవును చూస్తూనే అది చూడిదో, కాదో-అయితే సుమారు ఎన్ని నెలలుంటాయో చెప్పగలిగేవారు. సుడులనుబట్టి శ్రేష్ఠత చెప్పగలిగేవారు.

గోక్షీరం మాతృహీన శిశువులకు పోషకాహారంగా ఎంతో ఉపకారకంగా భావించేవారు. ఆవుపాలలో ఉండే శ్రేష్ఠత మరే పాలలోనూ ఉండదు. వైద్యశాస్త్రపరంగాను, మానసిక శాస్త్రపరంగాను కూడా గోమయం, గోమూత్రం, గోఘృతం అద్భుతమైన రీతులలో ఉపకరిస్తాయి. అంతేకాక మనోసంయమనానికి, ఆధ్యాత్మిక విలువల పెంపకానికీ కూడా చాలా సహకారాన్నిస్తాయి గోవు నుండి వచ్చే వివిధ పదార్థాలూ కూడా. ఇవన్నీ తరతరాలుగా గ్రహించి, అనుభవించిన వారంతా గోవును 'మాత'

అన్నారు. ఆ మాతను పూజించి తరించమన్నారు. మనకు ఏ చిన్న మేలు చేసిన జీవికైనా మన కృతజ్ఞత తెలియజేయటానికి దానిని పూజించటం హిందూ జాతికి అలవాటు. మరి యింత మేలు చేసే గోమాతను పూజించటంలోను, ఆ జాతిని రక్షించుకోవాలనటంలోనూ ఏ మాత్రం తప్పు లేదు. చివరికిదంతా మన జీవితంలో ఒక భాగమైపోయింది.

అందుకే "కదురాడిన యింట, కవ్వమాడిన యింట కరువుండదంట" అనే నానుడి పుట్టింది. అది అక్షరాక్షర సత్యం కూడాను. అసలు "ఆవు దూడను కట్టిన తాడు (కన్నె తాడు అంటారు దీనిని) దాటి వెడితే కళ్లు పోతాయి" అనేంత గాఢ శ్రద్ధ గోవు పట్ల మనకున్నది. సంక్రాంతిని పశువుల పండుగగా చేయటం- (కనుము నాడు) మన సంప్రదాయం. ఆ రోజు గోశాలలన్నీ కడిగి, అలికి ముగ్గులు పెట్టటం, గోవులను శుభ్రంగా కడిగి కొమ్ములకు పసుపు కుంకుమ రాయటం హారతిచ్చి బెల్లం తినిపించటం మన అలవాటు. ఇటువంటి ప్రేమతో, గౌరవంతో సేవించుకున్న గోవును హింసించి నరికి ముక్కలు చేసి ఆరగించాలన్న దౌర్భాగ్యభావన తురక జాతి మన దేశంలో అడుగుపెట్టటంతో వచ్చింది. శివాజీ చరిత్రలో బాల శివాజీ ఆరేడేండ్ల వయసులోనే గోవులను నరకడానికి తీసుకువెళ్లే కసాయి వారిని అడ్డుకొని గోవు భారతశ్వాసకోశమన్నాడు. "ఆ గోవుని, దానిని చుట్టుకొని ఏడ్చే దూడను చూడండి. వాటి కన్నీరు మీ వంశ నాశనానికి ఎత్తే శాపజలం సుమా! జాగ్రత్త!" అని బెదిరించాడు. నాటి నుండీ నేటికీ యీ గోవధను ఖచ్చితంగా ఆపలేకపోవటం మన దౌర్భాగ్యం. ఈ దౌర్భాగ్యానికి పరాకాష్ఠ మన రాజ్యాంగంలో "సెక్యులర్" అనే ముక్క 'మతాతీత రాజ్యాంగం' - అంటే దేశంలో అనాదిగా ఉండటమే గాదు - దేశం పేరులోనే ఉన్న మతాన్నీ, ధర్మాన్నీ పణంగా పెట్టి-ఎటునుంచో వచ్చి నెత్తినెక్కి పిండి గొట్టిన వారినో, చాప క్రింద నీళ్లలాగా జాతిని పరధర్మం వైపు లాగి భ్రష్టులను చేసే వాళ్లనో నెత్తికెక్కించుకొని మంగళహారతులివ్వ మనా అర్థం? ఏమో-ఆ ముక్క





సెక్యులర్ మంత్రం చదివే పెద్ద మనుషులకే తెలియాలి!

అసలు దీనికంతటికీ మన - అంటే అనాదిగా దేశం స్థాపించు కొన్న (సనాతన) ధర్మాన్ని గట్టిగా పట్టుకొని ఉండాలన్న దీక్ష మరచిపోయిన మన జాతిదే తప్పు. ధర్మాన్ని రక్షించుకోలేకపోయాం, దేశం మొత్తం మనకే నిలుపుకోలేకపోయాం. దేశం ఎక్కడ పోయిందో అక్కడ విధర్మమే ప్రబలిపోయింది. పోనీ, దేశం రెండుగా చీలిపోయిననాడైనా మనదైన, ఖచ్చితమైన ధర్మాన్ని అనుసరించే వారికే యీ గడ్డపైన చోటుంటుందని అనలేకపోయాం. నట్టింట విధర్మాన్ని నిలుపుకొని ఆ ద్వేషజ్వాలలకు బలి అవుతూనే ఉన్నాం. చివరికి గోరక్షణ అన్నది రాజకీయాలకు ఒక పావుగా మారిపోయింది. ఆలగోడు, బాలగోడు సర్వనాశనం చేస్తున్నదిజ దేశాన్ని. నవమాసాలు మోసి కన్నబిడ్డను వీధులపాలు చెయ్యటం, చదువుపేరిట వాళ్లను నానారకాల హింసపెట్టడం, బాలకార్మికులను చెయ్యటం యివన్నీ బాలగోడైతే-యింతకాలం మనకు కన్నతల్లిలా పాలిచ్చి, ఎడ్లనిచ్చి ఎన్నో రకాల రోగాలు బాగుచేసి, వాతావరణ కాలుష్యం తగ్గించి, సేవ చేసిన గోవులను కోసుకు తిని వాటి (ఆల)గోడుకు కారణమవుతున్నాం. ఇదే మన దేశానికి శాపం. వీటికితోడు వృద్ధ ఘోష ఎలాగూ కొడుతూనే ఉన్నదనుకోండి.

గోరక్షణ పేరిట కార్యక్రమాలు, సదస్సులు ఏవేవో జరుగుతున్నాయి. ఇక్కడ అందరం కూడా తెలిసో, తెలియకో ఒక విషయం విస్మరిస్తున్నాం. గోవు అంటే ఆవు అన్నదొక్కటే అర్థం కాదు. 'గోవిందుడు' అన్న పేరు విష్ణువుకున్నది. అంటే భూమిని, ధర్మాన్ని (వేదాన్ని), గోవు-మూడింటినీ పొందువాడు అని అర్థం. మన భూమిని మనం కాపాడుకొంటే మన ధర్మాన్నీ, మన గోమాతలను కూడా రక్షించుకోగలం. ఈ విషయం మరచిపోయి, ఒక్క గోవును గురించి మాత్రమే ఆలోచిస్తుంటే తెలివితక్కువ వాళ్లమవుతాము. వేదాన్నీ, వేదం మూలకారణంగా వచ్చిన ఉపనిషత్తులనూ, వాటికి సారంగా వచ్చిన భగవద్గీతనూ కూడా మరచిపోయి, తమ మాన్యత్వాన్ని ధనానికీ, పదవులకూ ధారపోసుకొని, డబ్బో మరోటో వస్తుందంటే

పదవుల్లో ఉన్న ఏ విధర్మీయులకైనా, గూండా నాయకులకైనా సరే ఆశీర్వచన పనసలు చదివే స్థితిలోకి దిగజారటం వల్లనే మన జాతికి మార్గదర్శకంగా ఉండవలసిన బ్రాహ్మణ్యం హీనస్థితికి జారిపోయింది. అశ్వమేధ యాగాలకూ, నదీ పుష్కరాలకూ, ప్రారంభోత్సవాలకు, పూర్ణాహుతులకు విధర్మీయులను (పదవిలో ఉన్నారు గనుక) ఆహ్వానించి, వాళ్ల బూటుకాళ్లతో వచ్చి నిలబడడాన్ని సహించి దాసోహమన్న దౌర్భాగ్యం మన అగ్ర జాతులదే-హిందువులదే. ఇక ధర్మరక్షణ ఎలాగ? ధర్మమే నశించిననాడు ఈ దేశానికి విశిష్టత, పవిత్రత ఏవీ? ధర్మం లేని దేశంలో ఉన్నాగానీ మనం మనదైన రీతిలో బ్రతకలేము. మన గుడికి మనం వెళ్లి పూజ చేసుకోవాలన్నా ఎవరి దయాధర్మ భిక్షకో ఎదురుచూడవలసిన పరిస్థితి అనుభవిస్తూనే ఉన్నాం గదా!

అందుచేత మిత్రులారా, దేశహితవరులారా! కేవలం గోవును రక్షించటం అన్న ఒక్కటే మన లక్ష్యంగా భావించకూడదు మనం. మొత్తం మొత్తం దేశం మీద, ధర్మం మీదనే దృష్టి పెట్టాలి. మాన్యులు శ్రీ రాళ్లపల్లి అనంతకృష్ణశర్మగారు ఒక సందర్భంలో యిలా అన్నారు-"స్వాతంత్ర్యం అంటే స్వరాజ్యమని మాత్రమే కాదు-కేవలం దానికోసమే పోరాడుతూ ప్రజలలోని నీతి, మత, ధర్మాదులలో ఉన్న దాస్యాన్ని, దైన్యాన్ని గమనించకుండా వదిలి పెట్టి 'స్వాతంత్ర్యం' కోసం మాత్రమే పోరాడటం అవివేకం. రాజకీయ స్వాతంత్ర్యం ఒక కొమ్మలోని పండేగానీ పంటంతా అదే కాదు. తక్కిన వాటితోపాటు అదీ పండుతుంది. దానికోసమే ప్రత్యేకంగా శ్రమించి, తక్కిన వాటిని వదిలిపెట్టటం వెర్రి సేద్యం". ఇది అక్షర సత్యం.అలా కానినాడు అల నాడు వ్యాపారం పేరిట యీ దేశానికి వచ్చిన వారికి బానిసలమైనట్లే (తిరిగి యిప్పుడూ అదే .పేరిట అదే కుట్రసాగుతోంది)మరోసారి బానిసలమవుతాం.

మా గురుదేవులు శ్రీశ్రీశ్రీ స్వామీ సత్యపదానంద ప్రభుజీ వారు నిరంతరం చెప్పేమాట "ధర్మాన్ని పాలించండి, దేశాన్ని రక్షించండి". అంచేత





మనం ప్రతి క్షణం ధార్మికరీతిలో జీవిస్తూ, అధర్మాన్ని ఎదిరిస్తూ, దేశాన్ని పరుల పాలు కాకుండా - పరిపాలనలో, విద్యలో, విత్తనాల్లో, చిరు వ్యాపారాల్లో, ప్రతిచోటా తలదూరుస్తున్న విదేశీ హస్తాలను అదుపులో ఉంచుకొనే ప్రయత్నం తీవ్రంగా చేస్తే మన ధర్మం మనదే - మన గోమాతా చిరంజీవే. 'జైహింద్' అందాం.

'గొప్ప కలలు కనండి - వాటిని నిజం చేసుకోవటానికి నిరంతరం శ్రమించండి' అన్నారు అబ్దుల్‌కలాం. ఇప్పుడు మన సంకల్పం ఆ స్థాయిలోనే ఉండాలి.

## లేఖావాణి

*అమ్మా!*

నమస్కారములు.

మీ 'సాయివాణి'లోని 'నివేదన' అనే శీర్షిక చదివాను. దానిలోని లోతులను, మా భావాలను వ్రాయమన్నారు. ఇందులో భగవంతుని యెడల భక్తులకుండే గాఢమైన ప్రేమ స్వరూపం వ్యక్తం అవుతుంది. ఇది నాకు అందిన లోతు. ఇక నా భావానికి వస్తే యీ భక్తునికి భగవంతుని పిలుపు అందింది. ఆ పిలుపును అనుసరించి బయలుదేరాడు. తన హృదయమే భగవన్నిలయమని తలపోశాడు. అంతటితో ఆగి ఉంటే సరిపోయేది. ఆజ్ఞాబద్ధుడై బయలుదేరాడుగా నీ అడుగుఅడుగునా అతన్ని సందేహాలు చుట్టుముట్టాయి. అయినా వాటిని వాడుకుంటూ వెళ్ళి భగవదైక్యం చెందాడు.

**- నమస్సులతో**

సాయిచరణ్

బాలవాణి

# స్వయంకృతం

– మాతాజీ

అనగనగా ఒక గంధర్వుడు. అతని పేరు ఇందీవరాక్షుడు. ఆయన నలనాభుడు అనే గంధర్వుని కొడుకు. అందగాడు, యువకుడు. బ్రహ్మ మిత్రుడు అనే ఒకానొక గురువు తన శిష్యులకు రేబవళ్లు ఆయుర్వేద విద్యను నేర్పుతూండడం అతను గమనించాడు. అతనికి కూడా ఆ విద్య నేర్చుకోవాలనిపించింది. బ్రహ్మమిత్రుని చెంతకు వెళ్లి సాష్టాంగ నమస్కారం చేసి "నాకు కూడ మీ శిష్యులతోపాటు ఆయుర్వేద విద్య నేర్పండి" అని ప్రార్థించాడు. ఆ రోజులలో విద్య సంస్కారహీనులకు నేర్పేవారు కారు. అందుచేత గురువు ఇందీవరాక్షుని కోరిక విని, "నటులతో, గాయకులతో దుష్టవర్తనులైన విటులతో, వేశ్యలతో తిరుగుతూ, వారి పలుకులకు చెవులొగ్గే నీకు ఈ విద్య రుచించదులే" అని పరుషంగా అన్నాడు. అందుకు గంధర్వుడు "నేను కూడా తన వంటి పెద్దల శిక్షణలో పెరిగినవాడినే - మీరనుకుంటున్నట్లు త్రోవ తప్పినవాడిని కాను. నా మీద దయ ఉంచి విద్య నేర్పండి" అని తిరిగి ప్రార్థించాడు. ఐనా గురువు ఒప్పకోక "ధన మదంతో, రాజ్య మదంతో కన్నుగానకుండా ఉన్న నీవంటి వానికి చదువేమిటి? నీకు చెప్పడం కన్నా తెలివితక్కువ ఉంటుందా, ఫో, ఫో" అన్నాడు. దాంతో ఇందీవరాక్షునికి పట్టరాని కోపం వచ్చింది. కానీ పెద్దలు "ఆయువు మూడిన వాడు వైద్యుడిని ధిక్కరిస్తాడు" అన్నారు గదా? అని ఆలోచించుకొని తమాయించుకొన్నాడు తాత్కాలికంగా. కానీ, అహం ఆగనివ్వలేదు. "ఓయి మూర్ఖ తపస్వీ! నీ దగ్గర చదువుకోవాలి గదా అని ఐశ్వర్యం వదిలి దౌర్భాగ్యాన్ని వరించాలా! నీవూ వద్దు-నీ చదువూ వద్దు" అని తుస్కరించి వెళ్లిపోయాడు.





మనకు కాలం సరిగా లేనపుడు రారాని దుష్టపు ఊహలెన్నెన్నో వస్తుంటాయి తలలోకి. ఇందీవరాక్షునిలో తామసం నిద్రలేచింది. "ఏం, ఆయన దగ్గరున్న శిష్యులంతా అంత ఉత్తములా! అంత నిర్లక్ష్యంగా నన్ను పొమ్మంటాడా ఆ బ్రాహ్మడు!" అని లోలోపల రగిలిపోయాడు. అంతేగాక- తన జాతికి సహజంగా అబ్బేటువంటి శాంబరీ విద్య సాయంతో (కోరిన రూపాన్ని ధరించగల విద్య) రూపం మార్చుకొని, వినయం గల శిష్యుని వేషంతో వెళ్లి, ఆ బ్రహ్మమిత్రుని దగ్గర చేరాడు. చాలా చురుకుగా ఎనిమిది రకాలైన ఆయుర్వేద విభాగాలను అంటే కాయ, బాల, ఊర్ధ్వాంగ, శల్య, దంష్ట్రా, జర, గ్రహ, వృష చికిత్సలన్నీ ఎనిమిది నెలల్లోనే చక్కగా నేర్చుకొన్నాడు. నేర్చిన విద్యలతో ఆనందించి ఊరుకుంటే బాగుండేది. కానీ నెత్తిన శని కూర్చుంటే నోరు సవ్యంగా ఎందుకుంటుంది! ఇందీవరాక్షుడు తన మాయ ఆకృతిని విడిచి, మామూలు రూపంలో గురువు ముందు నిలబడ్డాడు. "మర్యాదగా నమస్కరించి, "నాకు విద్య నేర్పు తండ్రీ!" అంటే కసిరికొట్టావు. నేర్చుకోవాలనే ఆకాంక్ష ఉన్న వాడికి విద్య రాకుండా పోతుందా! గుండ్రాయి దాస్తే పెళ్లి ఆగుతుందా? నీ దగ్గరే విద్య నేర్చుకొన్నాను-చూడు" అని తల ఎగరేసి మరీ హేళన చేసాడు. బ్రహ్మమిత్రుడు మండిపడ్డాడు. "ఓరీ అహంభావీ, మాయోపాయంతో నా దగ్గర విద్య నేర్చిందేకాక నన్ను హేళన చేస్తావా, అనుభవించు. రాక్షసుడివై మాంసం తింటూ, రక్తం త్రాగుతూ బ్రతుకు ఫో!" అని శపించాడు. ఇందీవరాక్షుడికి అప్పటికి కళ్లు తెరిపిన పడ్డాయి. వెంటనే గురువు పాదాలంటి నమస్కరించి, శాప విమోచనం చెప్పమని ప్రార్థించాడు. "నాయనా! అనవసరమైన అహంతో శాపం పొందావు-అయినాగానీ తప్పు తెలిసికొని క్షమార్పణ అడిగావు గనుక

చెప్తున్నాను. ఆకలితో నీ కన్నకూతురినే తినబోతావు. అప్పడు నిన్నొక మహానుభావుడు చంపుతాడు. అప్పటివరకు నీవీ రాక్షసాకృతిలో ఉండక తప్పదు" అన్నాడు బ్రహ్మదత్తుడు.

తన స్వయంకృతాపరాధానికి చింతిస్తున్నంతలోనే ఇందీవరాక్షుని శరీరం పెరిగి పెరిగి అసురాకృతి ధరించింది. విపరీతమైన ఆకలీ, దాహమూ మొదలయ్యాయి. అతడు కనిపించిన ప్రతి జీవినీ భక్షించ సాగాడు. అలా కొంతకాలం గడిచిన తరువాత తన కన్నకూతురైన మనోరమ అన్న పిల్లనే తినబోయాడు. ఆమె తనకు ఎదురుగా వస్తున్న స్వరోచి అన్న ఒక రాజును శరణువేడింది. స్వరోచి తన వీరత్వంతో ఇందీవరాక్షుని నేలగూల్చాడు. గంధర్వరూపం ధరించిన ఇందీవరాక్షుడు తన కథ స్వరోచికి చెప్పి, తాను నేర్చిన ఆయుర్వేద విద్యతోపాటు తన కుమార్తె మనోరమను కూడా అతనికి సమర్పించుకున్నాడు. తనకు సహజంగా వచ్చిన శాంబరీ విద్యతో, అహంభావంతో పూజ్యులైన వారిని ధిక్కరించి శాపం పొందిన వాడి కథ ఇది. దీనిలో మరో కథ కూడా యిమిడ్చారు అల్లసాని పెద్దనగారు తమ మనుచరిత్రలో.

మనోరమకు కళావతి, విభావసి అనే యిద్దరు స్నేహితురాళ్లున్నారు. ఒకరోజు ముగ్గురూ కలిసి వెండికొండ మీద పూలుకోస్తూ విహరిస్తూ ఒకచోట ఒక గుహ చూచారు. దాని ద్వారం ముందంతా బాగా గడ్డి పెరిగిపోయింది. లోపలికి వెడితే ఒక ముని తపస్సు చేసుకుంటూ కనిపించాడు. ఆయన బాగా వృద్ధుడు. శరీరమంతా క్షీణించిపోయింది. నరాలు బయటపడినాయి. శరీరం మీద ఉన్న రోమాలన్నీ కూడా నెరిసి పోవటంతో మొత్తం ఒక దూదిగుట్టలాగా ఉన్నాడాయన. ఆయనను చూచిన యీ అమ్మాయిలు ముగ్గురికీ నవ్వు వచ్చింది. వాళ్లలో కళావతి ఒక ఋషిపుత్రిక. విభావసి ఒక విద్యాధరుని కుమార్తె. అలాటి సంస్కార





వంతమైన కుటుంబాలలో నుంచీ వచ్చి కూడా యౌవనం తెచ్చిన చపలత్వానికి, అమర్యాదకు లోనయ్యారు వీరు. "ఈ దూది మూటకు ముక్కూ, నోరు, కళ్లులాంటివేమైనా ఉన్నాయా, లేవా! చూద్దాం" అనుకొన్నారు. మనోరమ ఆ ఋషి ముఖం పట్టుకొన్నది. వేళ్లు గట్టిగా తగలటంతో తపో భంగమైన వృద్ధ తాపసి కళ్లు తెరిచి, "ఓసీ మూర్ఖ యువతీ, నీ వయసుకు సరిపోయే వారితో సరసాలాడక-ఎక్కడో గుహాంతర్భాగంలో ముక్కు మూసుకొని తపస్సు చేసుకొనే మా వంటి వారిని పట్టి లాభం ఏమిటి? అవినయంతో దుశ్చర్య చేసావు గనుక రాక్షసులకు ఆహారానివై పో" అని శపించాడు. అంతటితో ఆగక నాగ బెత్తంతో ఆమెను కొట్టి ఏడిపించాడు. దానితో కళావతి విభావసులకు కోపం వచ్చింది.

"ఏమయ్యా దయాహీనుడవైన మునీశ్వరా, ఆమె ఏమి చేసిందని నీకంత కోపం? నీ తపస్సుకు పరాకాష్ఠ యితరులకు శాపాలివ్వటమేనా? కోపాన్ని జయించలేని వాడవు నీవెలాటి మునివి? తనను పొగిడితే ఆనందించక, తనను తెగడితే కోపించక నిలవగలవాడే మునిగానీ నీవేం మునివి - మాయ మునివి" అని నిందించారు ఆ యువతులు మునీశ్వరుని. దానికాయన మరింతగా మండిపడి "మీ యిద్దరూ క్షయ రోగ పీడితులగుదురు గాక!" అని శపించారు. గురు జన ధిక్కారం ఎలాటి వారినైనా ఆపదలపాలు చేస్తుంది గదా!

గురువులంటే మనకు విద్యాబోధనో, మంత్ర ప్రదానమో చేసిన వారనీ, సొంత తల్లిదండ్రులూ, పెద్దవారైనా బంధువులనీ మాత్రమే కాదు - వయో వృద్ధులు, జ్ఞాన వృద్ధులైన ఎవరిని ధిక్కరించటమైనా పాపహేతువే - దుఃఖ మూలకమే - అని తెలుసుకోవటం అత్యంత ఆవశ్యకం. "నోరా, నువ్వు పోకే - నాకు తేకే" అని వీపు ఏడుస్తుందన్న సామెత మనం విన్నదే కదా!

# శ్రీ సాయి-సేవ

## శ్రీసాయి సేవ అవసరమా?

**– సాయివాణీ ప్రచురణలు**

**(గత సంచిక తరువాయి)**

ఓ రాజ్యంలో మంత్రి పదవికి పోటీ ఉంది ఆ రోజు. అభ్యర్థులందరికీ ఆరుగంటలకు రావాలని చెప్పారు. పోటీకి వచ్చే దారి మలుపులో దారికి అడ్డంగా ఒక రాయి ఉంది. దారేమో సన్ననిది. మలుపు తిరిగే ప్రతివాడికీ అది తగిలే అవకాశం ఉంది. అభ్యర్థులందరూ ఆరుగంటలకన్నా ఐదు, పది నిముషాల ముందుగానే వచ్చారు. ఒక్కడు మాత్రం పది నిమిషాలు ఆలస్యంగా వచ్చాడు.

కారణం అడిగారు. "త్రోవలో ఒక రాయి ఉంది. మలుపు తిరిగేదాకా అది కనపడదు. వృద్ధులు, పరుగెత్తుకు వచ్చే చిన్నపిల్లలు ఎవరైనా దాన్ని తట్టుకొని క్రిందపడే అవకాశం ఉంది. అంచేత ఆ రాయి తీసి పక్కకు పడేసి వస్తున్నాను. కాస్త పెద్ద రాయి గనుక ఆలస్యమైంది" అన్నాడతను.

"నీకు మంత్రి పదవి మీద ఆసక్తి లేదా?" అని ప్రశ్నించారు. "అయ్యా, మంత్రి అంటే రాజ్యానికి కలిగే కష్టాలు తొలగించటంలో సాయపడేవాడు గదా! ఇంత చిన్న సేవ సమాజానికి చెయ్యలేకపోతే యిక నేను రాజ్యానికేమి చేయగలను?" అన్నాడతడు.

అదీ బాధ్యతగా సేవను స్వీకరించటం అంటే. అతనికే మంత్రి పదవి దక్కింది. అది వేరే కథ.

అంతేకాదు సేవాభావం అన్నది స్పాంటేనియస్‌గా అంటే అప్రయత్నంగా ఏ ప్లానింగ్ లేకుండా రావటం అన్నది - ఒక రకంగా పూర్వజన్మ సుకృతమేమో అనిపిస్తుంది. కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తగా, రష్యన్ ట్రాన్స్‌లేటర్‌గా





పనిచేసిన సుప్రసిద్ధ రచయిత ఉప్పల లక్ష్మణరావుగారు రష్యాలో ఉన్నారు కొంతకాలం. ఒకరోజు ఆయనను మిత్రులు ఒక పార్టీకి పిలిచారు. "నీకొక విశిష్టవ్యక్తిని పరిచయం చేస్తాం. తప్పక రమ్మ"న్నారు కూడా.

సరే, ఆ పార్టీ రోజు సాయంత్రం లక్ష్మణరావుగారు పార్టీకి అనువైన బట్టలు వేసుకొని బయలుదేరారు. వీరు రోడ్డు మీద నడుస్తుండగానే ఒక పేడ, ఎరువు నింపిన లాగుడుబండి కనిపించింది. అది ముందుగా వెడుతోంది. ఒక నడికారు మనిషి దాన్ని లాగుతున్నాడు. రోడ్డు అక్కడ ఎత్తుగా ఉంది. లాగేవాడికి చాలా కష్టమవుతోంది.

లక్ష్మణరావుగారికి జాలివేసింది. వెళ్లి సాయం చెయ్యాలనుకొన్నారు. కానీ తాను పార్టీకి వెడుతున్నాడు...... పైగా మంచి బట్టలు వేసుకొని ఉన్నాడు. బండిలో ఉన్న పేడా, ఎరువు చిందితే బట్టలు పాడవుతాయి. ఆ డ్రెస్‌లో వెళ్లటం పార్టీ ఇచ్చే వారిని అవమానించినట్లవుతుంది.

ఈయన యిలా తటపటాయించే లోపుగానే ఒకమ్మాయి- అప్పటిదాకా ఈయన వెనుకే నడుస్తున్నది - మిల్క్‌వైట్ ఫ్రిల్డ్ గౌనులో ఉంది - బొమ్మలా ఉంది - చకచక ముందుకు వెళ్లిపోయింది. గౌను చేతులు పైకి మడిచి పెట్టుకొని ఆ బండి వెనుక నుండి నెట్టసాగింది.

బండి ఎత్తు ఎక్కి మళ్లీ దిగి మామూలు రోడ్డు మీదకి వెళ్లేవరకు అలా సాయపడింది. అటుపైన వీధి ప్రక్క కొళాయి దగ్గర తన బట్టల మీది మరకలన్నీ కడిగేసుకొని తన త్రోవన తాను వెళ్లిపోయింది.

లక్ష్మణరావుగారు ఆ పని తాను చేయలేనందుకు కించపడుతూనే పార్టీకి వెళ్లారు. అక్కడ ఆయనకు మిత్రుడు పరిచయం చేసిన విశిష్టవ్యక్తి ఆ అమ్మాయే. ఆమె పేరు మెల్లీషోలింగర్ (తరువాత మెల్లీ ఇండియా వచ్చి అనేక సాంఘిక సంస్కరణోద్యమాలలోనూ, స్వాతంత్ర్య సమరంలో కూడా పాల్గొన్నది).

**(సశేషం)**



ఓం శ్రీ సాయిరాం

# షిరిడీ డైరీ

- మాన్యశ్రీ జి.ఎస్. కపర్దే

అనువాదం : మాతా శుకవాణి

(గత సంచిక తరువాయి)

**10-12-1910**

ఉదయం ప్రార్థన అయ్యాక నేను మా అబ్బాయితో మా ప్రయాణం గురించి సాయి మహరాజుకు ఏమీ చెప్పవద్దని చెప్పాను. "ఆయనకు అన్నీ తెలుసు. మనను ఎప్పుడు పంపాలో ఆయనకు తెలుసు'' అని కూడా చెప్పాను. యథాప్రకారం సాయిని ఉదయం దర్శించుకొన్నాం. తరువాత మసీదుకు వెళ్లాము. సాయి చాలా సంతోషంగా ఉన్నారు. తనతో ఆడుతున్న పిల్ల గత జన్మ కథ మాకు చెప్పారు. ఆమె ఒక కళాకారిణి అనీ, మరణించాక మామూలుగా సమాధి చేసారనీ, ఓసారి తాము ఆ త్రోవన వెడుతూ ఒక రాత్రి ఆమె సమాధి దగ్గర గడిపామనీ, అంచేత ఆమె తమను అనుసరించి వచ్చిందనీ, తామామెను ఒక బాబుల్ చెట్టు మీద ఉంచామనీ, తరువాత యిక్కడికి తెచ్చామనీ చెప్పారు. తాము గత జన్మలో కబీరనీ, అప్పుడు నూలు వడుకుతూ ఉండేవారమనీ కూడా చెప్పారు. సంభాషణ చాలా ఆనందదాయకంగా నడిచింది.

ఆ సాయంత్రం వార్ధా నుండీ శ్రీధరపంత్ పరాంజపే, పండిట్ అనే ఒక వైద్యుడూ, మరో పెద్దమనిషీ కలిసి వచ్చారు. వాళ్లతోపాటు అహమ్మద్‌నగర్‌కు చెందిన పట్వర్ధన్ కూడా ఉన్నాడు. ఇతను మా అబ్బాయికి కాలేజి రోజుల్లో మిత్రుడు. వాళ్లంతా సాయి దర్శనానికి వెడుతుంటే మేము కూడా వెళ్లాము. సాయి మహరాజు అందరినీ ఎలా ఆదరిస్తారో వారినీ అలాగే ఆదరించారు. కాసేపు తేలీ, మార్వాడీ వంటి వారిని గురించి మాట్లాడాక- అక్కడ వస్తున్న భవనాల గురించి మాట్లాడుతూ యిలా అన్నారు - "జనానికి పిచ్చెక్కింది. ప్రతి





వాడూ ఏదో ఒక చిత్రమైన దుష్టచింతనకు లోనవుతున్నాడు. అందుకే వాళ్లు ఏమి చెప్పినా వినను. జవాబు ఇవ్వను. ఏమని జవా బివ్వను?'' ఆ తరువాత ఆయన ఊదీ పంచి వాడాకు వెళ్ళి పొమ్మన్నారు. జూనియర్ పట్వర్ధన్‌ను మాత్రం ఆగి మర్నాడు వెళ్ళమన్నారు. నేను, సహస్రబుద్ధే వాడాకు తిరిగి వచ్చాము. పరంజపే, అతనితో వచ్చిన వాళ్ళు రాధాకృష్ణమాయి దగ్గరకు వెళ్ళినట్లు ఉన్నారు. బాపుసాహెబ్‌జోగ్ భార్య జబ్బు పడింది. ఆమె బాబా బోధల వలన చాలా లబ్ధి పొందింది. కానీ, బాబా ఆమెకు మందేమీ ఇవ్వలేదు. దానితో ఆమె విసిగిపోయి ఇవాళే వెళ్ళిపోతానంది. జోగ్ కూడా ఏమీ చెయ్యలేక ఆమె వెళ్ళడానికి ఒప్పుకున్నాడు. సాయిసాహెబ్ ఆమె గురించీ, ఆమె ఎప్పుడు వెళ్ళిపోతుందన్న దాని గురించీ ఎన్నో ప్రశ్నలు అడిగారు. ఏమైతేనేం? చివరికి బాపుసాహెబు బాబా అనుమతి తీసుకోవడానికి వెళదాం అనగానే ఆమె "నాకు ఇప్పుడు కాస్త తేలిగ్గా ఉంది. నేను ఊరికి వెళ్ళను'' అన్నది. మేమందరం ఆశ్చర్యపోయాం.

**11-12-1910**

నా ఉదయ ప్రార్థన తరువాత స్నానం చేసి హరిభావ్ దీక్షిత్ (ఈయన కొద్దిమంది సహచరులతో కలిసి బొంబాయి నుండి వచ్చారు) స్వర్గీయ ఆత్మారామ్ పాండురంగ కుమారుడైన తర్ఖడ్, అకోలాలోని అన్నా సాహెబ్ మహాజనికి బంధువైన మహాజని అనే యువకుడు- అందరం కలిసి సాయిసాహెబ్‌ను చూడటానికి మామూలుగా వెళ్ళాం. ఇవాల్టి సంభాషణ ముఖ్యమైందే కాదు- రెండు సంఘటనల వలన బాగా గుర్తుండిపోయింది కూడా. సాయి మహరాజు తాము ఒక మూల కూర్చొని తమ శరీరం దిగువ భాగాన్ని చిలక శరీరంగా మార్చుకోవాలని కోరుకున్నారు. ఆ మార్పు జరిగింది. కానీ ఈయన ఓ యేడాది వరకు దాన్ని గ్రహించలేదు. లక్ష రూపాయలు పోగొట్టుకున్నారు. అప్పుడాయన ఓ స్తంభం దగ్గర కూర్చోసాగారు. అప్పుడొక పెద్ద పాము నిద్రలేచింది. అది కోపంగా ఎగిరి పైనుండి పడిపోయేది కూడా- ఇలా చెప్తూనే ఆయన విషయం మార్చేశారు. తాము ఒక స్థలానికి వెళ్ళామనీ, అక్కడ పాటిల్ తోట వేసి దాని గుండా గట్టి బాట వేసేవరకు తనను కదలనివ్వ

లేదని చెప్పారు. తాను అవి రెండూ పూర్తి చేశానన్నారు. ఆ సమయంలో కొంత మంది అక్కడికి వచ్చారు. సాయి "నిన్ను చూచిపోవడానికి నేను తప్ప నీకెవ్వరూ లేరు'' అన్నారు. సాయి చుట్టూ వాళ్ళను చూస్తూ ఇంకా ఇలా చెప్పారు. ఆమె తనకు బంధువనీ, మనిషిని దోచిన రోహిల్లాను పెళ్ళాడిందనీ చెప్పారు. ఆయన ఇంకా ఇలా అన్నారు. "ప్రపంచం చాలా చెడ్డది. మనుషులు పూర్వం ఉన్నట్లు లేరు. పూర్వం పవిత్రంగా, విశ్వసనీయంగా ఉండేవారు. ఇప్పుడు వారంతా అవిశ్వాసులుగా మారి, చెడునే ధ్యానిస్తున్నారు''. సాయి తన తండ్రి గురించీ, తాత గురించీ తనలో వచ్చిన మార్పును గురించీ ఏదో చెప్పారు. కానీ నాకర్థం కావడం లేదు.

ఇప్పుడు సంఘటన ఒకటి చెప్తాను. దీక్షిత్ కొన్ని పండ్లు తెచ్చారు. బాబా తాను కొన్ని తిని మిగతావి పంచిపెడు తున్నారు. అప్పుడు అక్కడే ఉన్న యీ తాలూకా మమలతదారు బాలా సాహెబ్ సాయి మహరాజ్ ఒకే రకం పళ్ళు ఇచ్చేస్తున్నారని అన్నారు. అప్పుడు నా కొడుకు తన మిత్రుడు పట్వర్థన్‌తో సాయి పళ్ళను స్వీకరించటం, లేకపోవటం అన్నది ఇచ్చిన వారి భక్తి మీద ఆధారపడి ఉంటుందని చెప్పారు. మా అబ్బాయి నాకూ పట్వర్థన్‌కు కూడా ఈ విషయాన్ని వివరిస్తూ ఉండటంతో కొంచెం శబ్దం అయింది. వెంటనే బాబా నా కళ్ళల్లోకి సూటిగా చూశారు. కోపంతో మండిపడ్డారు. ఏం మాట్లాడుతున్నావని డబాయించారు. నేనేం మాట్లాడటం లేదనీ, పిల్లలేదో వాళ్ళలో వాళ్ళే మాట్లాడుకుంటున్నారనీ చెప్పాను. మా అబ్బాయిని, పట్వర్థన్‌ని చూచి సాయి మూడ్ వెంటనే మారిపోయింది. చివరకు సాయి మహరాజ్ మొత్తం హరిభావ్ దీక్షిత్‌తోనే మాట్లాడుతూ ఉన్నారని బాలాసాహెబ్ మిరికర్ అన్నారు. సాయంత్రం మేం భోజనాలకు వెళ్ళినప్పుడు అహమ్మద్‌నగర్‌లో ఇనాందార్‌గానూ, స్పెషల్ మేజిస్ట్రేట్‌గాను ఉన్న ఓ పెద్దమనిషి వచ్చారు. ఆయన మిరికర్ తండ్రి. చాలా గౌరవనీయుడైన పాతకాలపు పెద్దమనిషి. ఆయన సంభాషణ నాకు చాలా నచ్చింది. పొద్దుగ్రుంకే వేళ మామూలుగా సాయి దర్శనం చేసుకున్నాం. రాత్రి అందరం కూర్చుని మాట్లాడుకున్నాం. రోజుటిలాగానే నూల్‌కర్ కుమారుడు విశ్వనాథ్ భజనలు చేశాడు.

**(సశేషం)**





# మాతృసంస్థ కబుర్లు

జనవరి 11 నుంచీ సెలవులు. కానీ, మా సాయి విద్యాధామం జనవరి 12వ తేదీన శ్రీ వివేకానంద జయంతి ఉత్సవం జరుపుకొన్నది. ఆ రోజు "వివేకానందుడు ఇప్పడు భారతభూమికి వస్తే .... " అనే దాని మీద వ్యాసరచన, "మళ్లీ రావయ్యా!" అని కవితా రచన, "నేనే ప్రధానినైతే" అనే దాని మీద వక్తృత్వాలలో పోటీలు పెట్టారు. అలాగే రంగువల్లులపై పోటీ నిర్వహించారు. సాయంత్రం శ్రీ వివేకానందులను గూర్చి స్వామీజీ (గురుదేవుల) ప్రవచనం, స్వీట్లు పంచటంతో ఉత్సవం ముగిసింది.

జనవరి 13, 14, 15 తేదీలలో సాయిధామంలో సంక్రాంతి పండుగ ముత్యాలముగ్గులతో, మధ్యన గొబ్బెమ్మలు తీర్చడాలతో నెలరోజులుగా జరిగిన ఉత్సవానికి భోగిమంటలు, అందులో గొబ్బి పిడకలు వేయడాలు, కప్పర భోగి పాయసాలు, విశేషపూజలు వగైరాలతో నడిచి, గడిచి పోయింది. అంతలో తరుముతూ రానేవచ్చింది గణతంత్ర దినోత్సవం. బడి (21వ తేదీన) తెరిచీ తెరవగానే 26వ తేదీ ఉత్సవం కోసం ఆటల పోటీలు, వ్యాసరచన, వక్తృత్వం, కవితా రచన, చేతివ్రాత, పద్య పఠనం, దేశభక్తి గేయాలు పాడటం మొదలైన రకరకాల అంశాలపై పోటీలు నిర్వహింపబడ్డాయి. ఝాన్సీలక్ష్మీబాయిపైన, శ్రీ సాయినాథ చరిత్ర, వివేకానందులపైన నిర్వహింపబడిన పోటీలలో విజేతలందరి పేర్లు, ఆటల పోటీలలో (దేశీయ క్రీడలు ఎక్కువగా) పాల్గొని విజేతలైన వారి పేర్లు లిస్టులు వ్రాయటం, వాటికి అనుగుణంగా బహుమతులు కొనటం, గత సంవత్సరం పాఠశాల లోనేగాక మండలంలో కూడా ప్రథమస్థానంలో నిలచిన విద్యార్థి కివ్వవలసిన పుస్తకాల ఏర్పాటు వగైరా వగైరాలతో మూడురోజులు ఒకటే హడావుడి. ఇదిలా ఉంటే సాంస్కృతిక కార్యక్రమాల కోసం శిక్షణల గోల

మరోవైపు. “నా డాన్స్ బాగుంటే నాకు ప్రైజిస్తారా?” అంటూ చైత్ర, సుధీరల సతాయింపు సాయంత్రాలు. అలాఅలా 26వ తేదీ ఉదయం వచ్చింది. పిల్లలు జెండాను, పరిసరాలను మామిడాకు తోరణాలతో అలంకరించారు. క్రితంరోజే భారతమాత మంటపం మొత్తం విగ్రహంతోసహా శుభ్రంగా కడిగి చుట్టూ ముగ్గులు తీర్చిదిద్దారు. ఉదయం భేరీ నినాదాలతో భారతాంబ దగ్గరకు వెళ్లి మాతృవందనం చేసి పాఠశాల ఆవరణలో సమావేశమైనారు.

పరమపూజ్య స్వామీజీ ఆనతి మేరకు శ్రీ మాధవరావుగారు (వాన ప్రస్థులు) జ్యోతి ప్రజ్వలన చేశారు. ప్రార్థన గీతాలాపన తరువాత పతాకావిష్కరణ జరిగింది. పాఠశాల మొత్తం మీద ఎక్కువకాలం జీవించి ఉండి స్వాతంత్ర్యఫలాలను అనుభవించగలవారెవరో లెక్కచూచి ఎల్.కే.జీ తరగతిలో ఉన్న చి॥ సాయికీర్తన, చి॥ భార్గవ్‌ల చేత పతాకం ఎగుర వేయించారు. పతాకవందనం తరువాత పరమపూజ్య గురుదేవులు తమ సందేశం, ఆశీస్సులు ప్రసాదించారు. అటుపైన మాతాజీ రాజ్యాంగం ప్రకారం, భారతీయ పౌరులకున్న బాధ్యతలేమిటో వరుసగా చెప్తూ, వాటిని ఏ విధంగా మనం విస్మరిస్తున్నామో, ఎక్కడెక్కడ భ్రష్టు పట్టిస్తున్నామో వివరించారు. విధులు మర్చిపోయి కేవలం హక్కులు మాత్రమే గుర్తుంచుకొనే ఏ జాతీ అభివృద్ధి చెందదని చెప్పారు.

ఉపన్యాసాల తరువాత పిరమిడ్స్‌తో ప్రారంభమై సాంస్కృతిక కార్య క్రమాలు జరిగాయి. దాదాపు ఇరవై అంశాలు ప్రదర్శింపబడ్డాయి. లెజిమ్స్, కోలాటాలు, ఆంగ్లనాటికలు, హిందీ నాటిక, నాట్యాలు, దేశభక్తి గేయాలు, అభినయ గీతాలు-మధ్య మధ్య ఉపన్యాసాలతో, పద్యాలతో రసవత్తరంగా ప్రదర్శన సాగింది. భారతమాతగా అమ్మలు, చిట్టి భారతమాతగా సుధీర ముద్దుగా సరిపోయారు. ముఖ్యంగా సుధీర ఆ వేషంలోనే పిరమిడ్స్ ప్రదర్శనలో శిఖరానికి ఎక్కి పతాకాన్ని పట్టుకొని నిలబడిన తీరు ధైర్యం అందరినీ అలరించింది. తెలివిగల కాకి పాత్రవేసి తన ప్రతిభను, చురుకు





దనాన్ని చాటుకున్న చైత్ర, పిరమిడ్స్‌లో చాతుర్యాన్ని చూపిన వాసు, అనేక రంగాలలో బహుమతులందుకొన్న వంశీ, నందూ, రాజేశ్వరి రామానుజం, సుధ, భువన జ్ఞానేశ్వర్ వగైరా పిల్లదండు అంతా ఆశ్రమం తరఫున రాణించగా- చి॥ రాజేశ్వరి సర్వతోముఖ ప్రతిభ (చదువు, సంస్కారం, సేవ) చూపినందుకు విశిష్ట బహుమతి పొందింది. ప్రదర్శనల తరువాత బహుమతి ప్రదానాంతరం మిఠాయి పంపిణీతో గణతంత్ర దినోత్సవం ముగిసింది.

ఫిబ్రవరి 13వ తేదీన సాయిధామంలో ఉదయం హడావుడి మొదలైంది. ఆశ్రమంలో నీటిని నిలువచేసి అన్ని భవనాలకూ అందించే నిమిత్తమై ఒక ఓవర్‌హెడ్ టేంక్ నిర్మించాలన్న సంకల్పంతో భూమి పూజ చేసారు పరమపూజ్య గురుదేవుల. ‘తాబేలు కొండ’ అని పిలుచుకొనే కొండ దిగువన 60వేల లీటర్ల పట్టే ప్రమాణంతో కట్టనున్న ఆ నిర్మాణానికి పది లక్షల ఎస్టిమేషన్. (మన మహోత్తమ ప్రభుత్వాల నిర్వాకంలో దేని ధర ఎప్పుడు-ఎంత-ఎందుకు పెరుగుతుందో ఎవ్వరికీ అంతుపట్టని విషయం గనుక యిది ఎంతకు పాకుతుందో తెలియదు.) ఈ నిర్మాణ నిమిత్తమై భూమి పూజ జరుగుతుండగా బడిపిల్లలు చాలామంది (స్కూలు టైమైంది గనుక) వెడుతూ వెడుతూ వచ్చి నిలబడి, సాయినామం చెప్పటం శుభప్రదంగా తోచింది. ఆశ్రమ బాలలు, పెద్దలు కలిసి విష్ణు సహస్ర నామ పారాయణ చేసారు. గంగ పుట్టిన పాదాలకు నమస్కరించి యీ తావున రానున్న బృహత్ జలపాత్ర నిండుగా ఎల్లవేళలా నీరు నింపుతుండమని ప్రార్థించారు అందరూ. ప్రసాద వినిమయం తరువాత-తొమ్మిదిన్నరకు-ఫిబ్రవరి 14వ తేదీ ఉదయం సత్తెనపల్లి శ్రీ కోదండరామ సాయి సన్నిధానంలో జరుగనున్న కార్యక్రమం నిమిత్తం గురుదేవులు తమ శిష్య బృదంతో ‘ధర్మవాహిని’లో బయలుదేరారు. నెలరోజుల వ్యవధిలో గీతలోని భక్తి యోగం, కర్మయోగాలను (మనలో మన మాట - ఒకరిద్దరికి పూర్తిగా

రాలేదు) కంఠస్థం చేసినందుకుగాను ఒక 'సర్‌ప్రైజ్ గిఫ్ట్' యిస్తానన్న తమ వాగ్దానం ప్రకారం ఐదుగురు వానరవీరులను కూడా బండి ఎక్కించారు మాతాజీ. వానర నాయకురాలిగా గీతక్క కూడా ఎక్కి కూర్చుంది. చంద్రారెడ్డి, నారాయణగారు, పిల్లమూక - అంతా దామెరచెర్లలో ఆగి మజ్జిగ సీసాలు (శేఖర్ గారి దగ్గర) అందుకొని అలాగే ముందుకు పోయాము. దారి పొడవునా కారప్పూస మేత, ఐస్‌క్రీంల చప్పరింతా మామూలేగా వానర సేనకు (అధునాతన)!

మధ్యాహ్నం రెండు గంటలయ్యేప్పటికి దాచేపల్లి చేరుకున్నాము. చేరువ లోనే ఓ చిన్న కుగ్రామం కేసనపల్లి. అక్కడ ఒక పాత ఆశ్రమం ఉన్నది. దాని పేరు శ్రీ రామానంద యోగాశ్రమం. నారాయణగారికి బాగా తెలిసిన ఆశ్రమం అది. ఒక తాతగారు శ్రీ స్వామి సత్యంగారు 1960 ప్రాంతాలలో దీనిని స్థాపించి అక్కడ సాధన సాగిస్తూ సన్యాస జీవనం గడిపారు. వారు కాలం చేసాక వారి కుమారులు శ్రీ హనుమంతరావుగారు వానప్రస్థాశ్రమం స్వీకరించి అక్కడే సాధనతో జీవించి సుమారు పదేళ్ల క్రితం వారు కూడా తరలి వెళ్లిపోయారు. ప్రస్తుతం అది శ్రీశ్రీ సత్యంగారి మనుమల అధీనంలో ఉన్నది. స్వామి వారు పూజించిన పూజా విగ్రహాలు, స్వామి వారి విగ్రహం, వారి కుమారుని విగ్రహం కూడా ఉన్నాయి పూజాగృహంలో. శిథిలమవు తోంటే పైన రేకులు కప్పిన ఒక యిల్లు, వెనుకభాగాన చిన్న నిర్మాణం, చుట్టూ ప్రహరీ ఉన్నాయి. ఆశ్రమంలో ఒక బావి, కొద్దిపాటి పూలమొక్కలు, రావి, వేప వృక్షాల చుట్టూ ఒక అరుగు- ప్రశాంతంగా ఉంది. ఏదో ఒక తపశ్శక్తి ఆవరించి ఉన్న సూచన మాత్రం అందుతోంది ప్రాంగణం అంతటా. అక్కడే ఉండి తనకు తాను వండుకుతింటూ సాధన చేసుకుంటున్న ఒక వృద్ధుడు తప్ప మరెవ్వరూ లేరక్కడ. రోజూ వచ్చి శుభ్రం చేసి వెడు తుంటుంది ఒక మనిషి. తదితరులెవ్వరూ ఉండరు. ఆ ఆశ్రమం పరిసరా లలో కూడా ఎవరూ ఉండరు. నిశ్శబ్దంగా, తనలోకి తాను చూచుకొంటు





న్నట్లున్న యీ ఆశ్రమం ప్రక్కనే నాగులేరు ప్రవహిస్తూ ఉంటుంది.

అంతకుముందు త్రోవలో మూడు మసీదులు, ఒక చర్చి తగిలాయి. అవి నాలుగూ చిన్నగా బిక్కుబిక్కుమంటున్నట్లుండేవి-రెండేళ్ల క్రితం వరకూ కూడా. ఇప్పుడవి విశాలమైన కట్టడాలతో, రంగులతో క్రొత్త బేంకి నోట్ల లాగా ఫెళఫెళమంటున్నాయి. హిందూ ధర్మ పరిరక్షణ కోసం వెలసి ఓ వెలుగు వెలిగిన ఆశ్రమాలేమో ఇదుగో-యీ దశలో-యింతకన్నా హీన మైన దశలో-చివరికి దీపం పెట్టే దిక్కు కూడా లేకుండా పడిఉన్నాయి. ఆ ఆశ్రమం వలన లబ్ధి పొందినవారికిగానీ, ఆనాటి బోధలు విన్నవారికి గానీ, కనీసం తమ చిన్ననాడు భోజనాలు పెడతారనో, ప్రసాదాలు దొరుకుతా యనో ఉత్సవాలకు పరిగెత్తిన వారికిగానీ, హిందూత్వమో అని మొత్తుకొనే సంస్థలకుగానీ, చివరికి ఆ గ్రామంలోనే నివసించే మాన్యులకుగానీ- "అయ్యో, ఇది మనకోసమే పుట్టింది, పెరిగింది, శ్రమించింది, క్షీణించింది- దీనికి కాస్త చేయందిద్దాం-దీనికి మళ్లీ కళ తెద్దాం-కనీసం రోజూ ఊడ్చి ముగ్గువేసి ఆ ఉన్న నాలుగు మొక్కలకూ నీళ్లు పోసే ఏర్పాటు చేద్దాం-పోనీ సాయంత్రం తీరికైన వేళ నలుగురం వెళ్లి ఆ ఆశ్రమంలో కూర్చొని దైవ ధ్యానం చేసుకుందాం" - ఇలా ఏదీ అనిపించకపోవటం అన్నది కేవలం హిందూజాతికి పట్టిన దౌర్భాగ్యం తప్ప మరేమీ కాదు. మన గ్రామంలోని శ్రద్ధా కేంద్రాలను మనం కాపాడు కోకపోతే ఎలా? కనీసం సాటి మతస్థులను చూచైనా నేర్చుకోవాలన్న యింగితజ్ఞానం లేకపోతే ఎలా? ఏదో తెలియని బాధ మనసును ఆవహించింది.

సరే, అక్కడి వరండాలో భోజనాలు చేసి, వేన్ ఎక్కేసాము. నాలుగు న్నరయ్యేప్పటికి సత్తెనపల్లి చేరుకున్నాము. ఎండతీవ్రత వలన చాలా అలసట కలిగింది. కాస్త విశ్రాంతి తీసుకొని మెల్లగా కోదండరాముని చెంతకు వెళ్లి కూర్చున్నాము. పిల్లలంతా కలిసి చక్కని భజనలు చెప్పారు. రామయ్య

గారు కూడా చెప్పారు. హారతిచ్చి, వచ్చి భోజనాలు కానిచ్చి నిద్రకుపక్రమించాక చూస్తే టైమింకా పదే! రోజూ పదకొండున్నరదాకా ఏదో చదువుతూ, వ్రాస్తూ అలవాటున కొంతా, మశకవీరుల దశన కాండ వలన కొంతా నిద్ర పట్టలేదు ఓ పట్టాన. అలా అలా తెల్లవారింది. ఎక్కడ సాయిబాబా గురించి కార్యక్రమం ఏర్పాటు చేసినా ఏదో ఒక అల్లరి, ఆందోళన, కంగారు కలిగించి, అంతలోనే హోరుగాలితో మబ్బులు చెదరగొట్టినట్లు చెదరగొట్టి-అంతా ప్రశాంతం చేయటం అన్నది బాబాగారి కొంటెపనుల్లో ఒకటి. రోజూ ఆరుగంటలకు పోయే కరెంటు ఆ రోజు అయిదింటికే పోయింది. స్నానాలకు నీళ్లు లేవు. ఎనిమిదిన్నరకు ముహూర్తం అంటే ఏడు, ఏడుంబావుకల్లా పూజ దగ్గరకు వెళ్లాలి. మళ్లీ కరెంట్ రావటం ఏ తొమ్మి దింటికో -ఇప్పుడెలా? కొద్దిసేపు తర్జనభర్జన తరువాత రోడ్డు మీద ఉన్న వీధి పంపు దగ్గరికి పరుగుతీసారు పిల్లలు. వాళ్ల స్నానాలు, ప్రార్థన పూర్తి చేసుకొనేలోపు మా చంద్రారెడ్డి రెండు బక్కెట్లు తీసుకొని వీధిపంపు నుంచీ నీళ్లు మోసుకురాసాగాడు-గురువుగారి కోసం, తదితర స్త్రీ జనం కోసం. అంతలో పిల్లలు వెళ్లి సాయానికి దిగారు. అన్ని బిందెలూ, పాత్రలూ మొత్తం నింపేటప్పటికి పావు తక్కువ ఎనిమిదైంది. అదుగో సరిగ్గా అప్పుడు వచ్చింది కరెంట్. "ఓహో! నరశక్తిని ఉపయోగించకుండా కేవలం యాంత్రికంగా బ్రతకవద్దని బాబా సూచిస్తు న్నారు-ఎవరు సేవకు ముందుకు దూకుతారో చూద్దామని పరీక్ష పెట్టారు కూడా అనుకొన్నాను నేను.

అర్ధరాత్రి బస్సు దిగి రెండు కిలోమీటర్లు (దాదాపు) నడిచి వచ్చిన రామకోటేశ్వర్రావు, సుబ్బారావు (క్షేత్రం), హైదరాబాదు బస్సు పట్టుకొని వచ్చిన బ్రహ్మారెడ్డి, ముత్యాలు ప్రొద్దుటికల్లా చేరుకోగా ఓ గంట ఆగి తెనాలి నుండీ వచ్చారు గోపీకృష్ణ, వాళ్లమ్మగారూ. పూజ ప్రారంభమైంది. విజయవాడ నుండీ చిరకాల మిత్రులు శ్రీమతి దేవకీదేవిగారు, శ్రీ దశవంతరావు గారు వచ్చారు. వారి వెనుకనే హైదరాబాద్‌నుంచీ ఇంజనీర్ రవీంద్రరావు గారు, తమ ధర్మపత్నితో, ఆమె తమ్ముడితో కూడా రావటంతో మాకెంతో





సంతోషం కలిగింది. శ్రీ శేఖర్‌గారు తమ మిత్రులతో వచ్చేసారు. కబ్బయ్యగారి మనుమడు సుబ్బారావుగారు, కోదండంగారు, ఇంకా మాకు అట్టే తెలియని స్థానిక భక్తులు కొందరు కూడా వచ్చారు. ఓ ప్రక్క పందిట్లోని వారంతా సాయి నామస్మరణ చేస్తుండగా-మరోప్రక్క శ్రీ రామయ్యగారి దంపతులు సశాస్త్రీయంగా గ్రహపూజ వగైరాలు చేసారు. సరిగ్గా ముహూర్తానికి పరమ పూజ్య గురుదేవులు అందించిన శంకువును రాంబాబు అందుకొని లోనికి దిగి నిలబడ్డాడు. నవరత్నాలు, విభూతి, పసుపు, కుంకుమలు అన్నీ గురుదేవుల ఆజ్ఞ మేరకు వేసి శంఖుస్థాపన చేసి, గోక్షీరంతో అభిషేకించారు శంకువును. అటుపైన తొలి ఐదురాళ్లను క్రమంలో పేర్చి మేస్త్రీ సిమెంటు చేసాడు. విష్ణు సహస్ర నామం, భగవద్గీతలోని భక్తి, కర్మయోగాలు పిల్లలు శ్రుతిపక్వంగా వినిపించారు. స్థానిక భక్తులు కృష్ణమూర్తిగారు కూడా చక్కని సంకీర్తనం చేసారు. భక్తులంతా నవధాన్యాలు చల్లి ప్రదక్షిణ నమస్కారాలు చేసుకున్నారు. అటుపైన వచ్చిన వారందరికీ అల్పాహారాల ఏర్పాటు జరిగింది. తదుపరి గురుదేవులతో అందరూ మనసారా మాట్లాడి ఒక్కరొక్కరుగా సెలవు తీసుకున్నారు. భోజ నాల వరకు ఉండాలంటే పనులున్నాయి. (ముఖ్యంగా బో.....లెడన్ని పెళ్లిళ్లున్నాయి ఆ రోజు) అంటూ వేరే ఊళ్లవారు అందరూ వెళ్లిపోగా చివరికి మళ్లీ రాత్రి వాళ్లమే మిగిలాము. అప్పటికి పదకొండున్నరయింది. పిల్లలు, పెద్దలు అందరూ ప్రక్కనే ఉన్న పణిదం సొసైటీవారి మగ్గాలు, పని విధానం అంతా చూచి వచ్చారు. అటుపై మధ్యాహ్నం దాకా ఓ కునుకు తీసి లేచారందరూ. తరువాత భోజనాలు చేసి వేన్ ఎక్కేసాము. ఈసారి రామయ్యగారి ఇల్లాలు (ప్రసన్నమైన ముఖంతో, చిరునవ్వుతో కూడిన స్నేహశీలతతో) కలివిడిగా ఉండటం వలన మాకందరికీ ఎప్పటిలాగా పొడిగాకాక ఆప్తంగా అనిపించింది సాయి సన్నిధానం. ఆ రాత్రి తొమ్మిదింటికి సాయిధామం చేరుకొన్నాము క్షేమంగా.